

# విధేయత

భూపాల్

ప్రభుత్వోన్నత పాఠశాలలో టైపిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్న వర్మకి రెండు సంవత్సరాల పాప- మమత. మమత పుట్టిన రోజుకి కొత్త బట్టలు కొందామని తన భార్య రాజ్యలక్ష్మితో కోఠీకి వెళ్ళాడు.

నాలుగు షాపులు తిరిగినా తనకు నచ్చిన కలర్ గౌను దొరక లేదు. మమతకి గౌనే కాకుండా రెండు సంవత్సరాలుగా రాజ్యలక్ష్మికీ చీర ఒక్కటన్నా కొననందున ఆమెకి కూడా చీర ఇప్పిస్తే బాగుంటుందనీ అనుకున్నాడు. జేబులో డబ్బు మాత్రం రెండు వందల యాభై రూపాయలకి మించి లేదు. ఎలాగైతేనేం ఏదో షాప్‌లో కుట్టించేందుకు గుడ్డ కొన్నాడు. అట్లే చీర ఒకటి నూట యాభై రూపాయలలోపే వుండాలంటే ఆ షాప్‌లో పనిచేసేవాళ్ళు ఓ ముప్పై చీరలు ముందు పడేశారు. మెటల్ షిఫాన్ చీరే కొనాలని ఆమె, అందుకు సరిపడా డబ్బు లేవంటూ అతనూ; మెటల్ షిఫాన్ చీర ధర ఎంత వుంటుందో ముందు అతనికి తెలియదు. షాపులో చూస్తుంటే తెలిసింది రెండు వందలకి తక్కువ లేవని. "ఎందుకండీ ఈ షాపులో లేవేమో గాని నూట యాభై రూపాయలకి దొరుకుతాయండీ మన పక్కింటి అనూరాధ కొన్నదండీ" అంటుంది రాజ్యలక్ష్మి.

అప్పటికే షాపులు తిరగలేక సిగ్గు పడుతున్న వర్మ మమత కొరకు కొన్న గౌను గుడ్డకి డబ్బులిచ్చేసి మరో షాపులోకి వెళ్ళారు. అక్కడ నూటా అరవైకి బేరం కుదిరిందనుకొని డబ్బులిచ్చి చీర తీసుకున్నారు. మరికాస్త బేరం చేసి నాలుగు మాటలు మాట్లాడితే ఆ చీర నూటయాభైకే ఇచ్చేవాడనీ, మీరే తొందరపడి పది రూపాయలు ఎక్కువ ఇచ్చేశారని రాజ్యలక్ష్మి అంది. నిజంగా పది రూపాయలు ఎక్కువ ఇచ్చేశానా అని అతనూ లోలోన కొంచెం బాధ పడ్డాడు. ఇంటికొచ్చాక ఆ చీర పక్కింటి అనూరాధకి చూపించింది రాజ్యలక్ష్మి. అది నూట నలభైఐదు ధర చీరని అనూరాధ తెగేసి చెప్పింది.రాజ్యలక్ష్మికి బాధ మరీ ఎక్కువైంది. "కొంచెం ఆలోచించక తొందరపడతారు. ఏదో కొనాలని కొనడమే కానీ, ధర ఎంతుంటుందా! కలర్ బాగుందా చూడరు. అనవసరంగా వాడికి పదిహేను రూపాయలు ఎక్కువిచ్చి వచ్చారు. అప్పటికీ నేను అంటూనే వున్నాను" ఇలా తన బాధను వ్యక్తం చేయసాగింది రాజ్యలక్ష్మి.

డబ్బు ఎక్కువ- అదీ ఎంత పది రూపాయలో, పదిహేనో. పోతే పోనీ గాని, ఈమె గులగడం, నొచ్చుకోవడం భరించలేకపోయాడు వర్మ. కోపం వచ్చేసింది "ఆ! పోనీ మరేమంటావ్... ఒక్క చీర కొనడానికి నీతోబాటు తోక పట్టుకొని పది షాపులు తిరగాలా? మాటిమాటికి పది తగ్గించండీ, ఐదు తగ్గించండీ అంటూ ఆ షాపువాడిని బతిమాలాలా? పోతేపోయాయి. మళ్లీ మాట్లాడకు ఏనా నీ అమ్మగారిసొమ్మా? నసుగుతున్నావ్. బాధపడిపోతున్నావ్ మూతి ముడిచావ్. చీర బాగోలేదంటే చెప్పు. ఇప్పుడే అగ్గిపెట్టి కాల్చేస్తాను. తూ... చీరలు కొన్న మొహమా? చక్కటివి కట్టిన మొహమా? కొంచెపుదానివి, పిల్లికి బిక్షం పెట్టని పీచపుదానివి..." ఇలా రెచ్చిపోయాడు వర్మ.

"చీర బాగోలేదంటే చెప్పు. ఇప్పుడే అగ్గిపెట్టి కాల్చేస్తాను. తూ... చీరలు కొన్న మొహమా? చక్కటివి కట్టిన మొహమా? కొంచెపు దానివి, పిల్లికి బిక్షం పెట్టని పీచపుదానివి"

అంతా విన్న రాజ్యలక్ష్మి మౌనం వహించింది. అతని మాటల్లో ఎన్ని మాటలు ఆయనకే వర్తిస్తాయో లెక్క చూసుకుంది. తనను అనవసరంగా తిట్టారని మూడు రోజులు మరో మాట లేకుండా ముఖం ముడ్చుకుంది.

నాల్గోనాడు "నిజమే డబ్బు ఎక్కువిచ్చావన్నా! రాజ్యలక్ష్మి నాకోసమే అంది గాని తన కోసంకాదుగా. ఇందులో ఆమె తప్పేముంది? నేనేమాత్రం ఎక్కువిచ్చానేమోనని బాధపడలేదా? ఆమెను కొంచెపుదానివీ, నీచపుదానివీ అనడంలో ఔచిత్యం లేదు. గత సంవత్సరం స్కూల్లో యానువల్ డే ఫంక్షన్ రోజున జరిగింది నాకు మాత్రం జ్ఞాపకం లేదా. ఆరోజు హెడ్‌మాస్టర్ ఏవో వస్తువులు తెప్పిస్తే వస్తువులన్నీ పిల్లలకి ఇచ్చేశాక ఖాళీ ఐన ప్లాస్టిక్ సంచులు రెండు ఇంటికి పట్టుకెళదాం అనుకోవడంలో, రంగు కాగితాలన్నీ కట్టేసి అలంకరించినాక మిగిలిపోయిన ఐదు మీటర్ల పురికొన దాచుకుని ఇంటికి పట్టుకెళదామనుకున్న నా గుణంలో మాత్రం నీచపు, కొంచెపు లక్షణాలు లేవా? ఛ...నేనే రాజ్యలక్ష్మిని అనవసరంగా నొప్పించాను. నిజం చెప్పాలంటే రాజ్యలక్ష్మిదే నాకన్నా నయం" అనుకున్నాడు వర్మ.

ఆరోజు సాయంత్రం తానే విధేయుడు కాక తప్పలేదు.